క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామరూరల్: నందిగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంతోపాటు ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ దిబ్బయ్య శుక్రవారం తెలిపారు. నందిగామ పట్టణంతోపాటు మండలంలోని అంబారుపేట, ఐతవరం, చందాపురం, కంచల, కేతవీరునిపాడు గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



చందర్లపాడు(నందిగామటౌన్):మండలంలోని ఉస్తేపల్లి లక్ష్మీనరసింహస్వామి వారి విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలను వారణాసి సంగమేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవాలు



నందిగామరూరల్: మండలంలోని చెరువు కొమ్ముపాలెం గ్రామంలో వేంచేసియున్న అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చకులు సుదర్శనాచార్యులు, వెంకటరాజన్ ఆచార్యులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వైఖానస సంప్రదాయ పద్ధతిలో అష్టోత్తర సహస్రనామ పుష్పార్చన, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎర్రకాలువ ప్రక్షాళనకు ఆర్డీఓ ఆదేశాలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఎర్రకాలువను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కె.బాలకృష్ణ శుక్రవారం ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం ఆయన కలిసి ఎర్రకాలువను సందర్శించారు. ఈసందర్భంగా ఆర్డీఓ బాలకృష్ణ మాట్లాడుతూ ఎర్రకాలువ ప్రక్షాళనకు అవసరమైన అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బందితో ఎర్రకాలువలోని చెత్త, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు. ఆర్డీఓ వెంట మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



గండేపల్లి(కంచికచర్ల) : గండేపల్లి మాజీ వార్డుసభ్యుడు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు చెరుకుమల్లి రాజు(54) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గ్రామానికి వెళ్లి రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజు కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో పార్టీ అభ్యున్నతికి రాజు విశేషంగా కృషిచేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. రాజు కుటుంబానికి అండగా ఉంటామని వివరించారు. రాజుకు నివాళులర్పించిన వారిలో పార్టీ గ్రామ కన్వీనర్ గడుపూడి సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, సర్పంచి బొక్కా రవికుమార్, ఉపసర్పంచి బెల్లంకొండ వెంకట సుబ్బారావు, పార్టీ నాయకులు సుంకు బాలాజీ, మట్టా చంద్రశేఖరరెడ్డి, కృష్ణ సాయి, కోటయ్య, ఎస్సీసెల్ నాయకుడు తలమాల కిషోర్ తదితరులు ఉన్నారు.



కంచికచర్లలో క్రీస్తు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



దబ్బాకుపల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



చందర్లపాడులో శిలువ మార్గం నిర్వహిస్తున్న చర్చి ఫాదర్, భక్తులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా చర్చిలలో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఆర్‌సిఎం చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిసె జయరాజు ఆధ్వర్యంలో మతగురువులు, సెయింట్ అన్స్ సిస్టర్స్, సంఘపెద్దలు, సంఘస్తులు పాల్గొని క్రీస్తు శ్రమల వృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లుగా శిలువ మార్గం ప్రదర్శన నిర్వహించారు.పోస్టాఫీసు వద్ద ఉన్న సిఎస్ఐ సెయింట్ థామస్ టౌన్ చర్చిలో డీనరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. చర్చి కమిటీ ప్రతినిధులు, ఉమెన్స్ ఫెలోషిప్, సండేస్కూల్, యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా కాకానినగర్‌లోని క్రైస్త చర్చిలో పాస్టర్ ఎ.విజయరావు, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చిలో బిషప్ జాన్‌బాబు, విలియంపేటలోని సీఎస్ఐ చర్చి, జిజిఎఫ్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ జోసఫ్ కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్టియన్‌పేట సిఎస్ఐ చర్చి, కోదాడ రోడ్డులోని బేతెస్థ ప్రార్థనామందిరం, ఎల్లడ చర్చి, కొలిమిబజారులోని ఐపిసిసి చర్చి, విద్యానగర్ సీయోను పెంతెకొస్తు చర్చి, చిల్లకల్లు రోడ్డులో ది పెంతెకొస్తు చర్చి, అమోద ఇండస్ట్రీస్‌లోని చర్చి, హోసన్నా మినిస్ట్రీస్, ఆర్టీసీ కాలనీలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఐ జి.రాజు ఆధ్వర్యంలో పోలీసుసిబ్బంది శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు..

కంచికచర్ల : మానవులు చేసిన పాపములకు ఏసుక్రీస్తు శిలువపై మరణం పొందియున్నాడని గండేపల్లి సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ కొండా స్టాలిన్ పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఉన్న క్రైస్తవ దేవాలయాల్లో గుడ్‌ఫ్రైడే(శుభ శుక్రవారం)ను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శిలువ మార్గంతో గ్రామ పురవీధుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు శిలువపై ఉండి పలికిన ఏడు మాటలను బోధించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం వత్సవాయి మండలంలో ఘనంగా నిర్వహించారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, మక్కపేట, చిట్టేల, మంగొల్లు, గోపినేనిపాలెం, భీమవరం తదితర గ్రామాల్లోని చర్చిలలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలువతో ఊరేగింపు నిర్వహించారు. సమస్త మానవాళి కోసం ఆయన శిలువపై మరణించిన రోజును శుభ శుక్రవారంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. పొరుగువారిని ప్రేమించడమే క్రీస్తు తత్వమని పేర్కొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జెజీఎం, షాలోమ్ చర్చిలతోపాటు ఆయాగ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముచ్చింతాల ఆర్‌సీఎం చర్చి వారు పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాల వరకు శిలువమార్గం నిర్వహించి, జీసస్ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ముచ్చింతాల చర్చి ఫాదర్ కామ క్రీస్తురాజు, సంఘ పెద్దలు గుజ్జర్లపూడి వడ్డీకాసులు, కోలకాని అర్జునరావు, తుమ్మల మహేష్, పంద్రకోల శ్రీనివాసరావు, ఉదయ్‌బాబు పాల్గొన్నారు.

జీసస్ త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే ..

జగ్గయ్యపేట అర్బన్: జీసస్ మహాత్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన శిలువ మార్గం క్రీస్తు శ్రమల ప్రదర్శన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులతో కలిసిశిలువను మోశారు. క్రైస్తవ సోదరులకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేంద్రరెడ్డి, పట్టణ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్‌పాషా, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, నాయకులు శీలం మంగారావు, మారిశెట్టి అనిల్, ఖాదర్‌బాబు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో, అనంతరం నిర్వహించిన శిలువమార్గంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆయా గ్రామాల్లోని చర్చిలు, నిత్య సహాయ మాత, పరిశుద్ధ లూర్దుమాత ఆలయాలలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పొన్నవరంలో పాస్టర్లు గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేలు, బోడవాడ-జమ్మవరంలో రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్, వెల్లంకిని పాస్టర్ బేస్‌పాల్, జగన్నాథపురంలో రెవ. ఫాదర్ సుగుణరావు ఆధ్వర్యాన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువమార్గం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి, యాదాల సుజాత, నన్నేబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాణి, రాజు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు



పేటలో శిలువమార్గం ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



సిలువగిరిలో శిలువమార్గం నిర్వహిస్తున్న భక్తులు



కంచికచర్లలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న భక్తులు



జగ్గయ్యపేటలో శిలువమార్గం ర్యాలీ



ప్రార్థనల్లో పాల్గొన్న పేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



పేట శిలువమార్గం ర్యాలీలో క్రీస్తుశ్రమల ప్రదర్శన



గొట్టుముక్కలలో క్రీస్తు శిలువను వీధుల్లో ఊరేగిస్తున్న విశ్వాసులు

ఏసుక్రీస్తు త్యాగం ప్రేమ..క్షమాపణలకు చిహ్నం

నందిగామటౌన్: ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా మానవజాతి పాపాలను క్షమించే మార్గాన్ని సుగమం చేశారని ఆర్సీఎం చర్చి ఫాదర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నందిగామ పట్టణం, మండల గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సిఎం చర్చి వద్ద నుంచి గాంధీ సెంటరు వరకు శిలువమార్గం ర్యాలీ నిర్వహించారు. చర్చి ఫాదర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువపై చేసిన ప్రాణత్యాగం ప్రేమ, క్షమాపణ, మోక్షాలకు చిహ్నంగా భావించాలని సూచించారు. శిలువమార్గంలో పాల్గొన్న క్రైస్తవులకు దొంతమాల చంద్రశేఖర్, పారా సురేష్, కామా ప్రభాకర్, మురళి, పాకాలపాటి కిరణ్, మాడుగుల సతీష్ తమ సొంతఖర్చులతో మజ్జిగ పంపిణీ చేశారు. రెండు వేల మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నందిగామ మండలంలో...

నందిగామ రూరల్:మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని రాఘవాపురం, రామిరెడ్డిపల్లి, కమ్మవారిపాలెం, సిలువగిరి గ్రామాల్లోని పరిశుద్ధ ఆలయం, ఆర్‌సీఎం, సిఎస్ఐ తదితర చర్చిల ప్రత్యేక ప్రార్థనలు అనంతరం పరిశుద్ధ శిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు ఫిలోమెన్ రాజు, విజయరాజు, జోజిరెడ్డి క్రీస్తు సందేశాన్ని అందించారు.

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు(నందిగామరూరల్):మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం శిలువమార్గాన్ని నిర్వహించారు. చర్చి ఫాదర్లు మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.



నందిగామ గాంధీ సెంటరులో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న ఫాదర్లు



జగ్గయ్యపేట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువమార్గం ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



వీరులపాడు: బోడవాడ-జమ్మవరంలో శిలువమార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు



నందిగామ : శిలువ మార్గంలో పాల్గొన్న క్రైస్తవులు

ప్రమాదాల నివారణపై అవగాహన

కంచికచర్ల : అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో ప్రజలు వెంటనే అగ్నిమాపక కేంద్ర అధికారులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కంచికచర్ల అగ్నిమాపక కేంద్ర అధికారి తలశిల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక రాజ్యలక్ష్మీ గ్యాస్ ఏజన్సీ వద్ద శుక్రవారం ఫైర్‌సిబ్బంది అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా కరపత్రాలు పంపిణీ చేసి డెమో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు వంట చేయడం పూర్తయిన వెంటనే గ్యాస్ స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. గ్యాస్ లీకవుతున్నట్లు గమనిస్తే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవికాలంలో ఎక్కువగా పొలాలు, ఇళ్లలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది కె.ప్రవీణ్‌కుమార్, కె.జయరాం, జి. శేఖర్‌బాబు ఎం.శ్రీనివాసరావు, ఎం.అశోక్, షేక్ తాజుద్దీన్, బి.సంజయ్‌వర్మ, జి.రాజశేఖర్, జీవీ నర్సయ్య, షేక్ సుభాని, ఎస్.శ్రీనివాస్, జి.జీవన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నేడు జలజీవన్ వెరిఫికేషన్ టీం సభ్యుల పర్యటన

నందిగామ రూరల్: మండలంలోని పెద్దవరం, అడవిరావులపాడు, లింగాలపాడు, తక్కెళ్లపాడు, పాతబెల్లంకొండపాలెం గ్రామాల్లో శనివారం జలజీవన్ వెరిఫికేషన్ టీం సభ్యులు పర్యటిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. వారు ఆయా గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పర్యటిస్తారన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రం, పాఠశాలలు, ఎస్ డబ్ల్యూపీసీ షెడ్డు, సీఎస్‌సీ భవనం తదితరాలను పరిశీలిస్తారని వివరించారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్

పెనుగంచిప్రోలు:భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. పెనుగంచిప్రోలులో శుక్రవారం మండల భవన నిర్మాణ కార్మికుల యూనియన్ సమావేశాన్ని ఆసంఘ అధ్యక్షుడు సముద్రాల వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మోమో 1214ను రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు వెంటనే చెల్లించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు నష్టాన్ని కలిగించే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 24న అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ధర్నాకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు వీర్ల నరసింహారావు, వి తరుపతిరావు, పొడుగు గోపాలరావు, పాపారావు, అంతటి శ్రీను, చింతమాల రమేష్, కె తిరుపతిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల

ఆక్రమణల్లో ఆలయానికి వెళ్లే రోడ్డు



ఆలయ ముఖద్వారం వద్ద రోడ్డు ఆక్రమణలతో వాహనదారుల ఇబ్బందులు

పెనుగంచిప్రోలు:ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలులో రోడ్లు ఆక్రమణలకు గురికావడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామంలోని శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తారు. ముఖ్యంగా శుక్ర, ఆదివారాల్లో వేలాదిగా భక్తులు వందలాది వాహనాల్లో తరలి వస్తుంటారు. అయితే ఆలయానికి వెళ్లే ముఖద్వారం సమీపంలో కొందరు వ్యక్తులు రోడ్డును సైతం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దుకాణాల ముందు ఉన్న రోడ్డుపైకి వారి వ్యాపారాలకు సంబంధించి బల్లలు, బడ్డీలు ఏర్పాటు చేసి వస్తువులు ఉంచటంతో రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతోంది. అసలే ఇరుకు రోడ్డు కాస్తా మరింత కుంచించుకుపోయింది. దీంతో వాహనదారులు, భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

భక్తులకు తప్పని అవస్థలు

సత్రాలకు వెళ్లే దారిలో కూడా...

ఆలయం వద్ద నుంచి అమ్మవారి సత్రాలకు వెళ్లే దారులు కూడా ఆక్రమణలతో నిండి పోయాయి. భక్తులు బోనాలు తెచ్చే పరిస్థితి కూడా లేకుండా రోడ్డు సగభాగం వరకు వ్యాపారాలు చేస్తుండటంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాపారాలు రోడ్డుపైకి రాకుండా షాపుల స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



సత్రాలకు వెళ్లే దారిలో ఆక్రమణలతో భక్తుల ఇబ్బందులు